సాక్షి సిద్దిపేట

శనివారం । 4 । నవంబర్ । 2023



అందోల్‌లో గెలుపెవరిది?

రాష్ట్ర రాజకీయాల్లో అందోల్ నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు ఉంది.

వివరాలు IIలో ▸



'డబుల్ బెడ్రూమ్' వచ్చాయా?

సీఎం కేసీఆర్ ఇస్తానన్న డబుల్ బెడ్రూం ఇళ్లు ఏవీ అని కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రశ్నించారు.

వివరాలు IIలో ▸



కేసీఆర్ గెలుపునకు కృషి..

కొల్గూరుకు చెందిన యాదవ సంఘం సభ్యులు మంత్రి హరీశ్‌రావును కలిశారు.

వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

టెన్త్ వార్షిక పరీక్షల ఫీజు 17లోగా చెల్లించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదో తరగతి వార్షిక పరీక్షల ఫీజు షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. ఈ మేరకు వివరాలను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం వెల్లడించారు. 2024 మార్చిలో పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల17 లోపు పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబర్ 1 వరకు, రూ.200తో 11వరకు, రూ.500 డిసెంబర్ 20వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.125, మూడు సబ్జెక్టులు, అంత కంటే తక్కువ సబ్జెక్టులు ఫెయిలైన వారు రూ.110, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఫెయిలైనవారు రూ.125, వొకేషనల్ విద్యార్థులు రూ. 60 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు



జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్

సిద్దిపేటకమాన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం సరఫరాను అరికట్టేందుకు కలెక్టరేట్‌లో జిల్లా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ మద్యం సరఫరా, పంపిణీకి చెక్ పెట్టేందుకు జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశామన్నారు. మద్యం సరఫరాకు సంబంధించి ఏమైనా సమాచారం ఉంటే ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయ టోల్ ఫ్రీ నంబర్ 1800 425 2523 లేదా 87126 58927కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. గత నెలలో 59 బెల్ట్ షాప్‌లపై కేసులు నమోదు చేసి, 58 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 68 బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. 1,879 లీటర్ల మద్యం, ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



సత్తాచాటిన సిద్దిపేట విద్యార్థులు

సిద్దిపేటజోన్: హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 2, 3 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో సిద్దిపేట విద్యార్థులు ప్రతిభ చూపారు. స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన టోర్నీలో అండర్-13 విభాగంలో అలీ బేగ్, అండర్ -9లో అస్మాత లు కాంస్య పతకాలు సాధించారు. వీరిని కరాటే కోచ్ పాషా అభినందించారు.

గోదావరి జలాలు తెచ్చిన ఘనత కేసీఆర్‌దే

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



నెంటూరులో ప్రసంగిస్తున్న ప్రతాప్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): సీఎం కేసీఆర్ పాలనలోనే అన్ని వర్గాలు సంక్షేమ బాట పట్టాయని, జిల్లాకు గోదావరి జలాలు తెచ్చిన ఘనత ఆయనదేనని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డితో కలిసి ఆయన వర్గల్ మండలం సామలపల్లి, నెంటూరు, మైలారం, చౌదరిపల్లి, శేరిపల్లి, చాంద్‌ఖాన్‌మక్త తదితర గ్రామాలలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కాంగ్రెస్ పాలనలో కరెంటు ఎప్పుడు వచ్చేదో తెలియని పరిస్థితి ఉండేదని, తాగునీళ్ల కోసం బోర్ల వద్ద గొడవలు జరిగేవని అన్నారు. కేసీఆర్ పాలనలో రైతు బంధు, రైతుబీమా, ఆసరా పెన్షన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర పథకాలతో పేదలకు, రైతులకు, ఇతర అన్ని వర్గాలకు సీఎం కేసీఆర్ అండగా నిలిచారన్నారు. కాంగ్రెస్, బీజేపీల మోసపూరిత మాటలు నమ్మొద్దని, ఎల్లవేళలా ప్రజాక్షేమం కోరుకునే సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆదరించి హ్యాట్రిక్ విజయం చేకూర్చాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు నాగరాజు, జెడ్పీటీసీ బాలమల్లు యాదవ్, ఎంపీపీ లతారమేష్‌గౌడ్, రామకష్టారెడ్డి, వైస్‌ఎంపీపీ బాల్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

సెంటిమెంట్ ఆలయం ముస్తాబు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

- కోనాయిపల్లికి రానున్న కేసీఆర్
- ఏర్పాట్లను పర్యవేక్షించిన అదనపు ఎస్పీ

నంగునూరు(సిద్దిపేట): సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు శనివారం మండల పరిధిలోని కోనాయిపల్లికి రానున్నారు. ఈ నేపథ్యంలో వేంకటేశ్వరాలయం ముస్తాబైంది. ఇద్దరు అగ్రనేతలకు సెంటిమెంట్ ఆలయం ఇది. శనివారం నామినేషన్ పత్రాలను వేంకటేశ్వరస్వామి వారి చెంత ఉంచి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10 గంటకు కోనాయిపల్లి చేరుకొని 11 గంటలకు నామినేషన్ పత్రాలపై కేసీఆర్ సంతకం చేయనున్నారు. అనంతరం గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతారని బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. నూతన ఆలయ నిర్మాణం జరిగిన తరువాత మొదటిసారిగా సీఎం కేసీఆర్ కోనాయిపల్లికి వస్తుండడంతో ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామస్తుల తోపాటు బీఆర్‌ఎస్ శ్రేణులు ఆలయ ప్రాంగణాన్ని పూలతో అలంకరించారు. లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ మల్లారెడ్డి, సిద్దిపేట ఏసీపీ సురేందర్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ ప్రసన్నకుమార్, రాజగోపాల్‌పేట ఎస్ఐ మోహన్‌రెడ్డి, గ్రామాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. బారికేడ్లను ఏర్పాటు చేయడంతో పాటు ముంద్రాయి మీదుగా కోనాయిపల్లి వెళ్లే దారిని చదును చేయించారు.

తొలి రోజు ఇద్దరే..

- గజ్వేల్‌లో ఇద్దరు అభ్యర్థుల నామినేషన్లు
- సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాకలో నిల్
- 10వ తేదీ వరకు స్వీకరణకు గడువు
- 13న పరిశీలన, 15 వరకు విత్‌డ్రా

సాక్షి, సిద్దిపేట అసెంబ్లీ ఎన్నికల ప్రధాన ఘట్టం ప్రారంభమైంది. శుక్రవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. శాసనసభ నియోజకవర్గాలకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ పారంభించారు. తొలి రోజు గజ్వేల్ నియోజకవర్గం నుంచి ఇద్దరు నామినేషన్లు దాఖలు చేయగా మూడు సెట్ల నామినేషన్ పత్రాలను అందించారు. సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాలలో ఎవరూ నామినేషన్‌లు వేయలేదు.

144 సెక్షన్ అమలు

సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయం, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్ ఐఓసీ భవనాల్లో నామినేషన్‌లు స్వీకరిస్తున్నారు. సాధారణ ఎన్నికలకు ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఈ నెల 13 వరకు నామినేషన్లను పరిశీలిస్తారు. 15వ తేదీ వరకు విత్‌డ్రా చేసుకోవచ్చు. అనంతరం అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తారు. సిద్దిపేట నియోజకవర్గంకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సిద్దిపేట ఆర్డీఓ రమేశ్ బాబు, దుబ్బాక ఆర్ఓగా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, హుస్నాబాద్ కు బెన్‌షాలం, గజ్వేల్ కు బన్సీలాల్ స్వీకరిస్తున్నారు. ఆర్ఓ కార్యాలయాల వద్ద 144 సెక్షన్‌ను పోలీసులు ఏర్పాటు చేశారు. పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఎన్నికల వ్యయ పరిశీలకుల నియామకం

దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాలకు అభ్యర్థుల ఎన్నికల వ్యయం పరిశీలకుడు వివేక్ కుమార్ సిన్హా, సిద్దిపేట, హుస్నాబాద్‌లకు వెంకటేశ్ బాబులను కేంద్ర ఎన్నికల సంఘం నియమించారు. వీరు అభ్యర్థులు ఎన్నికల కోసం చేసే ఖర్చును రోజువారీగా పరిశీలిస్తారు.



సిద్దిపేటలో నామినేషన్ పత్రాల కోసం వచ్చిన వారు..

గజ్వేల్‌లో తమిళనాడుకు చెందిన వ్యక్తి నామినేషన్



గజ్వేల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గజ్వేల్ నియోజకవర్గం నుంచి తమిళనాడుకు చెందిన కె..పద్మరాజన్ శుక్రవారం నామినేషన్ వేశారు. తమిళనాడులోని సాలెం జిల్లా మెట్టూర్‌డామ్ తాలూకాకు చెందిన ఈయన ఇప్పటివరకు దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో 236 నామినేషన్లు వేసినట్లు చెప్పారు. వాజ్‌పేయి, పీవీ.నర్సింహారావు, జయలలిత, అద్వానీ, యడ్యూరప్ప, బంగారప్ప, సదానందగౌడ్, వైఎస్సార్, జగన్మోహన్‌రెడ్డిలపై నామినేషన్లు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రముఖులపై నామినేషన్లు వేసినందు వల్ల తన పేరు వివిధ రికార్డుల్లో నమోదైందని తెలిపారు. ఇదే క్రమంలో సీఎం కేసీఆర్‌పై నామినేషన్ వేసినట్లు తెలిపారు. అలాగే సూర్యాపేట జిల్లాకు చెందిన ఓయూ పూర్వ విద్యార్థి సపావత్ సుమన్ సైతం గజ్వేల్‌లో నామినేషన్ వేశారు.

48 గంటల ముందే.. అనుమతి పొందాలి

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: రాజకీయ సమావేశాలు, ప్రచార వాహనాలకు సంబంధించి 48 గంటల ముందే అనుమతులు పొందాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. శుక్రవారం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కలెక్టర్, సీపీ శ్వేతలు కలిసి విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 4 నియోజకవర్గాలలో శాసనసభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం నామినేషన్ వేసిన అభ్యర్థి 24 గంటల్లోగా అఫిడవిట్‌ను అప్‌లోడ్ చేయాలన్నారు. ఎన్నికల ర్యాలీలు, సభలు, వాహనాలు, తదితర అనుమతుల కోసం రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు 48 గంటల ముందు రిటర్నింగ్ అధికారికి సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 24 గంటల్లోపు ఆర్ఓ అనుమతి ఇస్తారన్నారు. ఓటర్ల వివరాలను తెలుసుకునేందుకు 1950 టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేయాలన్నారు. ఈ టోల్ ఫ్రీ నంబర్ 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. 'సి విజిల్' ద్వారా ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు.

పకడ్బందీగా బందోబస్తు: సీపీ

అనంతరం పోలీస్ కమిషనర్ శ్వేత మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచే పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. నామినేషన్లు స్వీకరించే కేంద్రాల వద్ద సంబంధిత ఏసీపీల ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు చేపట్టామన్నారు. అలాగే 144 సెక్షన్ విధించినట్లు చెప్పారు. నామినేషన్ కేంద్రం వద్దకు మూడు వాహనాలు, అభ్యర్థితో సహ ఐదుగురికి నామినేషన్ కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సీఎం

- దుబ్బాక అభ్యర్థి రఘునందన్‌రావు
- మల్లేశంపల్లి, శౌరీపూర్‌లో ఎన్నికల ప్రచారం

దౌల్తాబాద్(దుబ్బాక): బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ నాయకుడినే సీఎం చేస్తామని ప్రకటించిన ఏకైక పార్టీ బీజేపీయేనని దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మల్లేశంపల్లి, శౌరీపూర్‌లో రఘునందన్‌రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకే గ్యారంటీ లేదు కాంగ్రెస్ నాయకుల మాటలకు గ్యారంటీలేదని విమర్శించారు. తొమ్మిదేళ్ల మెదక్ ఎంపీగా పని చేసిన కొత్త ప్రభాకర్‌రెడ్డి దుబ్బాకకు ఏమి చేశారో చెప్పాలన్నారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కిషన్, కోనాయిపల్లి సర్పంచ్ సురేందర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో మద్యం ఏరులు

దుబ్బాకరూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పద్మనాభునిపల్లి, తిమ్మాపూర్ గ్రామాలల్లో బీజేపి అభ్యర్థి ఎమ్మెల్యే రఘునందన్ రావు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో మద్యం ఏరులై పారుతుందని, యువత మద్యానికి బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫించన్లు ఎంత పెంచితే అంత మద్యం ధర పెంచుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మద్యానికి వచ్చే ఆదాయం రూ.50వేల కోట్లు అయితే, సంక్షేమ పథకాలను ఖర్చు చేసేది రూ.24వేల కోట్లని ఎద్దేవా చేశారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులే గ్రామాలల్లో మద్య షాపులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపి నాయకులు కర్ణాకర్, నరేష్, గుర్రాల సుబ్బు, సతీష్, శివప్రసాద్ పాల్గొన్నారు.



దౌల్తాబాద్: మల్లేశంపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న రఘునందన్‌రావు



రోడ్ షో లో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

గజ్వేల్‌లో ధర్మమే గెలుస్తుంది

- బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్
- కొండపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు
- ప్రచారం ప్రారంభించిన నేత

జగదేవ్‌పూర్(గజ్వేల్): గజ్వేల్‌లో ధర్మం ఆధర్మం మధ్య యుద్ధం జరుగుతోందని, చివరికి ధర్మమే గెలుస్తుందని బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. వందలాది మంది కేసీఆర్‌లాంటి జెజమ్మలు వచ్చినా బీజేపీ గెలుపును ఆపలేరని అన్నారు. శుక్రవారం జగదేవ్‌పూర్ మండలం కొండపోచమ్మ ఆలయంలో ఈటల ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తులాభారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హుజురాబాద్‌లో తన ఓటమి కోసం రూ.కోట్లు ఖర్చు పెట్టినా ధర్మమే గెలిచిందని తెలిపారు. రాష్ట్ర అధికార యంత్రాంగం, సంక్షేమ పథకాల డబ్బులన్నీ ఖర్చు చేసినా చివరికి ప్రజలు ధర్మమే గెలిపించారని అన్నారు. పదేళ్ల పాలనలో గజ్వేల్ ప్రజలకు సీఎం కేసీఆర్ అందుబాటులో ఉండకుంగా ప్రగతి భవనం, ఫాంహౌస్‌లో ఉన్నారని, ఇప్పుడు తను రాకతో గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉంటానని కాకమ్మ కథలు చెబుతున్నారని, కేసీఆర్‌ను నమ్మితే మోసం జరగడం ఖాయమన్నారు. పరిశ్రమలు, ప్రాజెక్టుల పేరుతో పేదల భూములు లాక్కొని పేదలకు అన్యాయం చేశారని, బీజేపీ అధికారంలోకి రాగానే గజ్వేల్‌లోని పేదలకు తిరిగి భూములు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ప్రసాద్‌రావు, రాంరెడ్డి, భాస్కర్, రాములు, గురువారెడ్డి, కృష్ణమూర్తి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతలు ఇస్తే తీసుకోండి

బీఆర్‌ఎస్ నాయకులు ఏమిచ్చినా తీసుకోండి..అది మన సొమ్మే.. ఎన్నికల్లో ఎంత ఇస్తే అంత తీసుకుని ఓట్ల రూపంలో కేసీఆర్ తగిన బుద్ధి చెప్పాలని కోరారు. దొరల గడీలను కూల్చడం ఓటుతోనే సాధ్యమని మీరంతా ఓటుతో దొరకు సెలవు ఇవ్వాలన్నారు. గజ్వేల్‌లో పోటీ చేస్తానని చెప్పి చేస్తున్నానని, మీరంతా మద్దతు ఇవ్వాలని కోరారు. నేను మీ బిడ్డను..అందుబాటులో ఉండే అందరి బాంధవుడను..గెలిపిస్తే బిఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న పేదల భూములను తిరిగి ఇప్పించే బాధ్యత నాదేనని తెలిపారు. అలాగే ఆర్అండ్ ఆర్ కాలనీ ప్రజలకు అండగా ఉంటానన్నారు.

రోడ్ షోలో జననీరాజనం

కొండపోచమ్మ నుంచి జగదేవ్‌పూర్ వరకు నిర్వహించిన రోడ్ షోకు జనం హారతులు పట్టారు. తిగుల్‌నర్సాపూర్, చాట్లపల్లి, వట్టిపల్లి, మునిగడప, గొల్లపల్లి, జగదేవ్‌పూర్, అలిరాజ్‌పేట గ్రామాల ముదిరాజ్ సంఘం నాయకులు, మహిళలు, బీజేపీ నాయకులు బతుకమ్మలతో, బోనాలతో, మంగళ హారతులతో ఈటలకు ఘన స్వాగతం పలికారు.

గజ్వేల్ గడ్డపై బీజేపీ జెండా ఎగరేస్తాం

మర్కూక్ (గజ్వేల్): గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ అభివృద్ధి చేసింది గోరంత, ప్రచారం కొండంత చేస్తున్నారని ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం గణేష్‌పల్లి, అంగడికిష్టాపూర్, చేబర్తి, నర్సన్నపేట, ఎర్రవల్లి, మర్కూక్, పాములపర్తి గ్రామాలలో బైక్ ర్యాలీ ద్వారా ప్రచారం నిర్వహించారు. మర్కూక్ మాజీ ఎంపీటీసీ గీతా రాంరెడ్డి, మర్కూక్ ఎంపీటీసీ చైతన్య శంకర్‌రెడ్డి గ్రామానికి చెందిన పలువురు ముదిరాజ్ సంఘం నాయకులు ఈటల సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయన కాండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు మహిళలు బోనాలతో స్వాగతం పలికారు.

హుస్నాబాద్‌లో ఏర్పాట్లు ఏవీ?

- నామినేషన్ కేంద్రంలో అసౌకర్యాలే..
- అసహనం వ్యక్తం చేసిన అభ్యర్థులు

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రమైన ఐఓసీ బిల్డింగ్ వద్ద అధికారులు ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో అధికారులు, సిబ్బంది ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ పత్రాలను స్వీకరిస్తున్నారు. ఈ సమయంలో నామినేషన్ వేసే అభ్యర్థులను తప్ప సామాన్య జనాన్ని ఐఓసీ బిల్డింగ్‌లోకి అనుమతించడం లేదు. ఏదైనా పని ఉంటే మధ్యాహ్నం 3 తర్వాతనే అనుమతి ఇస్తున్నారు. ఐఓసీ కేంద్రానికి 100 మీటర్ల దూరం వరకు ఎవరికీ అనుమతి లేదు. నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చే అభ్యర్థుల సందేహాలు నివృత్తి చేసుకునే హెల్ప్‌డెస్క్‌ను కార్యాలయం లోపల ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. టెంట్, తాగునీటి సౌకర్యం లేదని అభ్యర్థులు అసహనం వ్యక్తం చేశారు. నామినేషన్ పత్రాల్లో ఏమైనా తప్పులుంటే వాటిని సరిదిద్దుకునేందుకు సలహాలు ఇచ్చే అధికారులు లేరు. నామినేషన్ పత్రాల కోసం వచ్చిన బీఎస్పీ అభ్యర్థి పెద్దోల్ల శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పార్టీ నాయకులను లోపలికి వెళ్లకుండా 100 మీటర్ల దూరంలోనే పోలీస్‌లు అడ్డుకున్నారు. నామినేషన్ పత్రాలు, పలు అంశాలను నివృత్తి చేసుకునేందుకు వస్తే పోలీస్‌లు అనుమతించడం లేదని బీఎస్పీ నాయకులు వాపోయారు.



శ్రీనివాస్ యాదవ్ వాహనాన్ని అడ్డుకున్న పోలీసులు

దుబ్బాకలో టెన్షన్..టెన్షన్

ఎంపీపై హత్యాయత్నం ఘటన మరవకముందే..

- బీజేపీ ఎన్నికల రథంపై దాడి
- వరుస సంఘటనలతో భయాందోళన
- అభ్యర్థుల ప్రచారాలకు భారీగా పోలీసు బందోబస్తు

దుబ్బాకటౌన్: నియోజకవర్గంలో ఎప్పుడు.. ఏం జరుగుతుందో తెలియని భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధాన పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించడంతో వారం రోజులుగా నియోజకవర్గంలో ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలో గత నెల 30న సూరంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి జరిగిన ఘటన విదితమే. ఆ సమయంలో గన్‌మెన్లు అడ్డుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అప్పటికే కత్తి పొట్టలో బలంగా దిగడంతో ఎంపీకి యశోద ఆస్పత్రిలో వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన మరువకముందే గురువారం రాత్రి బీజేపీ ప్రచార రథంపై ముగ్గురు దాడికి పాల్పడ్డారు. ప్రధానమంత్రి మోదీ, ఎమ్మెల్యే రఘునందన్‌రావుల ఫ్లెక్సీలు చింపివేశారు. ముబారస్‌పూర్ శివారులో దాడికి యత్నించడంతో అప్రమత్తమైన డ్రైవర్ శివ బీజేపీ నాయకులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. దాడికి చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలంటూ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.





పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు (ఇన్‌సెట్‌లో) ధ్వంసమైన ప్రచార రథం

అభ్యర్థుల్లో గుబులు

దాడుల నేపథ్యంలో గ్రామాల్లో ప్రచారానికి వెళ్లాలంటేనే అభ్యర్థుల్లో గుబులు నెలకొన్నట్లు సమాచారం. ప్రధానంగా బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లు తమ క్యాడర్‌ను ఇప్పటికే అప్రమత్తంగా చేసుకొని ఉండడంతో పోటాపోటీ వాతావరణం నెలకొంది.

పోలీసుల పహారా

గ్రామాల్లో పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే రఘునందన్‌రావు చేపడుతున్న ఇంటింటా ప్రచారానికి బందోబస్తును పటిష్టం చేశారు. అలాగే నియోజకవర్గంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ అధికారులు పెట్రోలింగ్ చేపడుతున్నారు. ఏదిఏమైనా వరుస ఘటనలతో నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ఉద్రిక్తంగా తయారైంది.



బీడీలు చుడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, కౌన్సిలర్లు

బీడీలు చుడుతూ.. పథకాలను వివరిస్తూ..

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం జోరందుకుంది. బీఆర్‌ఎస్ దుబ్బాక అభ్యర్థి , ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా దుబ్బాక పట్టణంలో డబుల్ బెడ్రూం కాలనీలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీడీలు చుడుతూ.. కారు గుర్తుకు ఓటు వేసి ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని మహిళలను కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సులోచన, మీన, కల్పన, యాదమ్మ, రజిత బీఆర్‌ఎస్ మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శాలిపేట హోటల్‌లో టీ తాగుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి

ప్రచారం.. కాసేపు విరామం

చిన్నశంకరంపేట(మెదక్): పేట మండలం ఖాజాపూర్‌తండా, ఖాజాపూర్, కుమ్మరిపల్లి, రామాయపల్లి, శాలిపేట, చెన్నాయిపల్లి, వెంకట్రావుపల్లి, మడూర్ గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచార సమయంలో కాసేపు శాలిపేటలోని ఓ హోటల్ టీ తాగారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.



పత్తి చేనులో ప్రచారం చేస్తున్న నాయకులు

పత్తి చేనులో ప్రచారం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిమ్మాపూర్, అనంతసాగర్, గోపాల్‌పూర్ గ్రామాల్లో శుక్రవారం బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిమ్మాపూర్ గ్రామంలో పార్టీ నాయకులు పత్తి ఏరుతున్న కూలీల దగ్గరకు వెళ్లి అక్కా బాగున్నారా.. అవ్వా మంచిగున్నారా అంటూ ఆత్మీయంగా పలకరిస్తూ ప్రచారం చేశారు. కారు.. సర్కారు..కేసీఆర్‌కు ఓటు వేయాలంటూ అభ్యర్థించారు.




వర్గల్ మండలం మైలారంలో డప్పు కొడుతున్న వంటేరు

డప్పుకొట్టి.. దరువేసి

వర్గల్(గజ్వేల్): ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం వర్గల్ మండలం మైలారంలో సీఎం కేసీఆర్‌కు మద్దతుగా ప్రచారానికి రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వచ్చారు. ఇనుమడించిన ఉత్సాహంతో ర్యాలీలో చేరిపోయి డప్పుకొట్టి దరువేశారు. కార్యకర్తల్లో నూతనోత్సాహం కలిగించారు.

అందోల్ కోటలో గెలుపెవరిది..?

- తొమ్మిది సార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ, రెండు సార్లు బీఆర్‌ఎస్
- హ్యాట్రిక్ కోసం అధికార పార్టీ గురి
- పదో విజయంపై కాంగ్రెస్ కన్ను
- తీవ్రంగా శ్రమిస్తున్న ప్రధాన పార్టీలు



వట్‌పల్లి(అందోల్): రాష్ట్ర రాజకీయాల్లో 'అందోలు' నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడి నుంచి గెలుపొందిన మెజార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉప ముఖ్యమంత్రులయ్యారు. 1952లో అందోల్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి 16 సార్లు ఎన్నికలు జరిగితే రెండు సార్లు మాత్రమే స్థానిక ఎమ్మెల్యేలు గెలుపొందగా, మిగితా వాటిలో స్థానికేతరులు గెలుపొందారు.

మొత్తంగా తొమ్మిది సార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ, బీఆర్‌ఎస్ రెండు సార్లు, ఒకసారి ఇండిపెండెంట్ గెలుపొందాయి.

1952 నుంచి 1967 వరకు జనరల్ క్యాటగిరీ ఉండగా, 1967 నుంచి అందోల్ నియోజకవర్గాన్ని ఎస్సీలకు రిజర్వు చేశారు. రిజర్వుడు నియోజకవర్గంగా ఏర్పడిన తర్వాత 12 సార్లు జరిగిన ఎన్నికల్లో రాజనర్సింహ కుటుంబ సభ్యులే ఆరుసార్లు ఎన్నికయ్యారు. 1985, 1994 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి మల్యాల రాజయ్య గెలుపొందగా ఆర్థిక, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖలను నిర్వహించాడు. బాబూ మోహన్ 1998 ఉప ఎన్నిక , 1999 ఎన్నికల్లో టీడీపీ తరఫున గెలుపొంది కార్మిక శాఖ మంత్రిగా పని చేశారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం 2014 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి గెలుపొందారు.

1989, 2004, 2009 ఎన్నికల్లో దామోదర రాజనర్సింహ కాంగ్రెస్ తరఫున పోటీ చేసి మూడుసార్లు గెలుపొంది. మార్కెట్, వ్యవసాయ, విద్య, ఉప ముఖ్యమంత్రి పదవులను పొందాడు. అలాగే, ఓపెన్ కేటగిరి సమయంలో జోగిపేటకు చెందిన వ్యక్తి వైశ్యుడైన బస్వ మాణయ్య స్థానిక మొదటి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. ఆ తర్వాత 14 సార్లు ఎన్నికలు జరుగగా స్థానికేతరులే గెలుపొందారు. 1967లో రిజర్వుడు తర్వాత స్థానికులకు పోటీ చేసేందుకు అవకాశాలు లభించలేదు. 2018 ఎన్నికల నాటికి స్థానిక నినాదం బలపడింది. దీంతో ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో వట్‌పల్లి మండలంలోని పోతులబోగుడాకు చెందిన చంటి క్రాంతికిరణ్ విజయం సాధించడంతో రెండోసారి ఎమ్మెల్యే వ్యక్తి గెలిచారు.

నియోజకవర్గంలోని ఓటర్లు

మండలం	పురుషులు	స్త్రీలు	మొత్తం
అందోలు	22,438	23,670	46,109
అల్లాదుర్గం	11,371	11,933	23,304
రేగోడ్	9,082	9,292	18,374
టేక్మాల్	13,725	14,724	28,450
పుల్కల్	10,937	11,389	22,326
రాయికోడ్	16,136	15,650	31,787
మునిపల్లి	16,371	16,495	32,866
వట్‌పల్లి	12,452	12,602	25,055
చౌటకూర్	8,382	8755	17,138

అందోలు ఎమ్మెల్యేలు

1952	వెంకట రాజేశ్వర జోషి	(కాంగ్రెస్)
1957	బస్వ మాణయ్య	(స్వతంత్ర)
1962	ఎస్.లక్ష్మీదేవి	(కాంగ్రెస్)
1967	రాజనర్సింహ	(కాంగ్రెస్)
1972	రాజనర్సింహ	(కాంగ్రెస్)
1978	రాజనర్సింహ	(కాంగ్రెస్)
1983	హెచ్.లక్ష్మణ్ జీ	(కాంగ్రెస్)
1985	మల్యాల రాజయ్య	(టీడీపీ)
1989	దామోదర్	(కాంగ్రెస్)
1994	మల్యాల రాజయ్య	(టీడీపీ)
1998	పి.బాబుమోహన్	(టీడీపీ)
1999	పి.బాబుమోహన్	(టీడీపీ)
2004	దామోదర	(కాంగ్రెస్)
2009	దామోదర	(కాంగ్రెస్)
2014	బాబుమోహన్	(టీఆర్‌ఎస్)
2018	చంటి క్రాంతికిరణ్	(టీఆర్‌ఎస్)

జంగ్ తెలంగాణ

ఆ ఆరుగురి చుట్టే నర్సాపూర్





గుండం వీరయ్య



విఠల్‌రెడ్డి



జగన్నాథరావు



సునీతారెడ్డి



మదన్‌రెడ్డి

- ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు
- విఠల్‌రెడ్డి ఐదు, జగన్నాథరావు మూడుసార్లు విజయం
- గుండం వీరయ్య, జయరాంరెడ్డి ఒక్కోసారి..
- మదన్‌రెడ్డి రెండు, సునీతారెడ్డి మూడుసార్లు గెలుపు

నర్సాపూర్: నర్సాపూర్ శాసనసభ నియోజకవర్గం 1952 సంవత్సరంలో ఏర్పాటైంది. ఇప్పటి వరకు 15 సార్లు శాసనసభ ఎన్నికలు జరుగగా ఆరుగురు వ్యక్తుల చుట్టే విజయం తిరిగింది. 1952 నుంచి జరిగిన పలు ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందిన జయరాంరెడ్డి, గుండం వీరయ్య, చిలుముల విఠల్‌రెడ్డి, చౌటి జగన్నాథరావు మృతిచెందారు. కాగా సిట్టింగ్ ఎమ్మెల్యేగా చిలుముల మదన్‌రెడ్డి కొనసాగుతుండగా ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్యే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సునీతారెడ్డి పోటీ పడుతున్నారు.

1952లో మొదటిసారి ఎన్నికలు

1952 సంవత్సరంలో మొదటిసారి నర్సాపూర్ శాసనసభ నియోజకవర్గానికి ఎన్నికలు జరుగగా కాంగ్రెస్ నుంచి జయరాంరెడ్డి పోటీ చేసి సోషలిస్టు కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన భగవాన్‌దాస్‌పై విజయం సాధించారు. 1957లో కాంగ్రెస్ అభ్యర్థిగా గుండం వీరయ్య పోటీ చేసి పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసిన చిలుముల విఠల్‌రెడ్డిపై గెలుపొందారు. 1962లో చిలుముల విఠల్‌రెడ్డి సీపీఐ నుంచి మొదటిసారి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి చౌటి జగన్నాథరావుపై గెలుపొందారు. 1967, 1972 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ నుంచి పోటీ చేసిన చిలుముల విఠల్‌రెడ్డిపై కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన చౌటి జగన్నాథరావు వరుసగా రెండు సార్లు గెలుపొందారు. 1978లో కాంగ్రెస్ అభ్యర్థి చౌటిజగన్నాథరావుపై సీపీఐ అభ్యర్థి విఠల్‌రెడ్డి గెలుపొందగా, 1983లో సీపీఐ అభ్యర్థి చిలుముల విఠల్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి చౌటి జగన్నాథరావు గెలుపొందారు.

హ్యాట్రిక్ సాధించిన విఠల్‌రెడ్డి

1985, 1989, 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి జగన్నాథరావుపై సీపీఐ నుంచి పోటీ చేసిన చిలుముల విఠల్‌రెడ్డి వరుసగా మూడుసార్లు గెలుపొంది నర్సాపూర్ ఎమ్మెల్యేగా మొదటిసారి హ్యాట్రిక్ సాధించారు. అలాగే, 1999లో అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చిన వాకిటి సునీతారెడ్డి రెండు రికార్డులు సాధించారు. 1999 ఎన్నికల్లో గెలుపొంది నర్సాపూర్ నుంచి గెలుపొందిన మొదటి మహిళా ఎమ్మెల్యేగా రికార్డు పొందారు. అంతేగాక నర్సాపూర్ ఎమ్మెల్యేగా వరుసగా మూడుసార్లు (1999, 2004, 2009) గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు.

రెండు సార్లు మదన్‌రెడ్డి

1999, 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా మదన్‌రెడ్డి రెండు సార్లు ఓటమి చవిచూడగా ప్రత్యేక రాష్ట్రంలో రెండుసార్లు వరుసగా గెలుపొందారు. 2014లో జరిగిన ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన చిలుముల మదన్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి (హ్యాట్రిక్ ఎమ్మెల్యే) సునీతారెడ్డిపై గెలుపొందారు. 2018లో సైతం సునీతారెడ్డిపై రెండోసారి విజయం సాధించారు.

మీ ఓటు మా ఆయనకే..



ప్రచారం చేస్తున్న చంద్రశేఖర్ భార్య ప్రమీల

జహీరాబాద్: జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎ.చంద్రశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన భార్య ప్రమీల శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జహీరాబాద్ పట్టణంలోని 2వ వార్డులో ప్రజలతో మాట్లాడారు. పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్‌ని గెలిపిస్తే ప్రజా సమస్యలు తీరుతాయన్నారు. ఈ సందర్భంగా పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె వెంట మాజీ కౌన్సిలర్లు కండెం సుజాత, తాహెరాబేగం నాయకులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న రాజమణి మురళీయాదవ్

హత్నూర(సంగారెడ్డి): నర్సాపూర్ నియోజకవర్గంలో సునీతారెడ్డి, మదన్‌రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యమని, ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తామని ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణి మురళీయాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన హత్నూరలో బీజేపీ అభ్యర్థి మురళీయాదవ్‌కు మద్దతుగా ఆయన సతీమణి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నాగ ప్రభుగౌడ్, నాయకులు నీరుడి అశోక్, సతీష్ యాదవ్, రవి, సుధాకర్, సతీష్, నాయకులు పాల్గొన్నారు.

'డబుల్ బెడ్రూం' వచ్చాయా?



గ్యారంటీ పథకాలను వివరిస్తున్న పొన్నం

- హామీలను విస్మరించిన సీఎం కేసీఆర్
- కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్


అక్కన్నపేట(హుస్నాబాద్): కాంగ్రెస్ ఇచ్చిన ఇందిరమ్మ పథకం ఇళ్లలో అల్లుడు వస్తే ఏడ ఉంటాడు.. అని చెప్పిన సీఎం కేసీఆర్ మీ ఊరికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చాడా? అని కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రజలను అడిగారు. అక్కన్నపేట మండలంలోని మంచి నీళ్లబండ, కేశవాపూర్, గొల్లపల్లి, మల్లంపల్లి, మోత్కులపల్లి, పెద్దతండా గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిందన్నారు. రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో రాగానే ఆరు గ్యారంటీలు తప్పకుండా అమలు చేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాకతీయ యూనివర్సిటీ రిటైర్ ప్రొఫెసర్ వీరన్ననాయక్, అక్కన్నపేట గ్రామ సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క బూత్‌లో 1,400 మంది ఓటర్లే

నారాయణఖేడ్: ఎన్నికల నిర్వహణలో ప్రతీ పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,400 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా అధికారులు చూస్తారు. ఈ సంఖ్యను ఎందుకు పరిమితం చేశారంటే.. ఈవీఎంలకు అనుసంధానించి ఉండే వీవీ ప్యాట్‌లో థర్మల్ కాగితం పొందుపరుస్తారు. ఈ కాగితం 1,500 స్లిప్పులను మాత్రమే ప్రింట్ చేస్తుంది. 22.5 ఓల్ట్‌ల బ్యాటరీతో పనిచేసే వీవీ ప్యాట్‌లో ఓటు ఎవరికి వేసిందనేది డిస్‌ప్లేలో కనిపిస్తుంది. ఇందులో వంద వరకు కాగితపు స్లిప్పులు పోలింగ్ రోజున మాక్ పోలింగ్ ప్రక్రియ కోసం ఖర్చవుతాయి. అందుకే ప్రతీ పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,400మంది లోపు వరకు మాత్రమే ఓటర్లు ఉండేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంది.

నాయకులుంటే సరిపోతుందా..?

ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



ప్రచారంలో కనిపించని ప్రజలు

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండలం తునికిలో శుక్రవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కానీ, ప్రజలు ఎక్కువగా లేకపోవడంతో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అసహనానికి గురయ్యారు. ఇతర గ్రామాల నుంచి వచ్చిన నాయకులతోపాటు కొంత మంది స్థానికులు మాత్రమే ఉన్నారు. ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్, ఉపసర్పంచ్ ఇతర నాయకులు ఉన్నప్పటికీ ఎన్నికల ప్రచారం గురించి ప్రజలకు చెప్పలేదా అని ప్రశ్నించారు. నాయకులు ఉంటే సరిపోదని ప్రజలు ఉండాలన్నారు. ఓటర్లు అంతా కారు గుర్తుకే ఓటు వేసేలా చూడాలన్నారు.

రూ.28.50 లక్షలు స్వాధీనం



నగదు చూపుతున్న ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బెజ్జంకి క్రాసింగ్ రహదారిపై శుక్రవారం ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన వాహనాల తనిఖీల్లో పోలీసులు రూ.28.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట నుంచి వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా ముగ్గురు వ్యక్తులు ఎలాంటి పత్రాలు లేకుండా డబ్బులు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మానకొండూర్ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కనకయ్య, పీసీలు బాలరాజు, రవి, సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నేరస్తుడిని పీసీసీ అధ్యక్షుడిగా నియామకం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బండ ప్రకాశ్

రామాయంపేట(మెదక్): ఒక ఆర్థిక నేరస్తుడిగా ముద్రపడ్డ , ఓటుకు నోటు కేసులో పట్టుబడ్డ వ్యక్తిని పీసీసీ అధ్యక్షుడిగా నియమించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రామాయంపేటలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రం బీసీలకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు దేవేందర్ రెడ్డి, ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణయ్య, పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మోసకారి కేసీఆర్‌కు బుద్ధి చెప్పండి

జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ప్రతాప్‌రెడ్డి



కడవేర్గులో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించి, నమ్మక ద్రోహం చేసిన కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలని జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కడవేర్గు, పోతిరెడ్డి పల్లె, పెద్దరాజుపేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాలన్నారు. ఈ ప్రాంత రైతుల కష్టాలు తీర్చేందుకు నిర్మించిన తపాసుపల్లి డ్యాం నుంచి నీటిని సిద్దిపేటకు తరలించేందుకు ఒప్పుకోనందుకే తనను పార్టీ నుంచి వెళ్లిపోయేలా చేశాడన్నారు. ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే తపాస్‌పల్లి డ్యాం నుంచి సిద్దిపేటకు నీటిని తరలించే కాల్వలను మీ అందరి సహకారంతో, మీ సమక్షంలోనే కూల్చివేస్తానన్నారు. అలాగే, ఆయా గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీఫ్లోర్ లీడర్ గిరి కొండల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ చెవిటి లింగం, పీఏసీఎస్ డైరెక్టర్ కొమ్ము రవి, పార్టీ మండల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ నర్సింగరావు, నాయకులు పరమేశ్వర్, భాస్కర్‌రెడ్డి, ఆగంరెడ్డి, యాదగిరి, రాకేశ్ కృష్ణ, లాల్‌మహ్మద్, సంతోష్, శ్రీకాంత్, సన్నీ, విజయ్, శ్రీనివాస్, మల్లేశం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పల్లాను భారీ మెజార్టీతో గెలిపించండి

ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, తాటికొండ



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, పల్లా సతీమణి నీలిమ

చేర్యాల(సిద్దిపేట): సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు జనగామ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే చేర్యాల ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తాడని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని 7,8,9,10 వార్డుల్లో పల్లాకు మద్దతుగా ఆయన సతీమణి నీలిమ, కుమారుడు అనురాగ్‌లు నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే చేర్యాల ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు, మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశం, మున్సిపల్ కౌన్సిలర్లు మంగోలు చంటి, ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీష్ గౌడ్, జుబేదా ఖతూన్, మార్కెట్ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, పార్టీ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, కోతి విజయ్, మాజీ సర్పంచ్ ముస్త్యాల అరుణ, మాజీ ఉపసర్పంచ్ మంచాల కొండయ్య, నాయకులు తాడెం రంజిత, మేడిశెట్టి ఉమ, పచ్చిమడ్ల మానస, శివగారి అంజయ్య, బుడిగె గురువయ్య, నాగమల్ల శ్రీనివాస్, యాట భిక్షపతి, రావుల ఉమేశ్, పచ్చిమడ్ల సిద్ధిరాములు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఎస్పీ రోహిణీప్రియదర్శిని



మెదక్ మున్సిపాలిటీ: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్పీ రోహిణీప్రియదర్శిని సూచించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని అన్నారు. మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే నడిపిన వారిపై, ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. 2022 సంవత్సరంలో పలు విభాగాలకు సంబంధించి కేసుల వివరాలు వెల్లడించారు. సీటు బెల్టు పెట్టుకోని వి–8,200, సెల్‌ఫోన్ డ్రైవింగ్–1,943, హెల్మెట్ లేకుండా – 32,099, డ్రంకెన్‌డ్రైవ్ – 8,642, ఓవర్ స్పీడ్ – 75,403, చిన్న డ్రైవింగ్ కేసులు – 2,460, ట్రిపుల్ రైడింగ్ – 10,346 ఓవర్ లోడింగ్–359 కేసులు నమోదైనట్లు తెలిపారు. అలాగే, 2022లో మొత్తం ప్రమాదాల సంఖ్య – 522 కాగా, 263 మంది చనిపోయినట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో కూడా మార్పు రావాలని కోరారు.